క్లుప్తంగా

అనుదీప్ దంపతులకు సన్మానం



సన్మానిస్తున్న క్రీడాకారులు

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిన కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ దంపతులను లాన్ టెన్నిస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం సాయంత్రం సన్మానించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యుగంధర్‌రెడ్డి, కె.జకరీయా మాట్లాడుతూ.. పాల్వంచకు ఒక సింథటిక్ గ్రౌండ్, కొత్తగూడెంకు రెండు లాన్ టెన్నిస్ గ్రౌండ్‌లను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ వై.వెంకటేశ్వర్లు, వైటీఎంకే రాజు, డి.వేణుగోపాల్, బి.భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి

ఇల్లెందురూరల్: ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్ ఆఫీసర్ కృష్ణంరాజు సూచించారు. సుభాష్‌నగర్, బాలాజీనగర్ గ్రామపంచాయతీలలో మంగళవారం ఆర్టీసీ సేవలపై ఆయన అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. విద్యార్థులు, వికలాంగులకు బస్‌పాస్, శుభ కార్యాలకు ఆర్టీసీ అద్దె విధానం తదితర అంశాలను వివరించారు. సర్పంచ్‌లు మంగమ్మ, పాయం స్వాతి, కార్యదర్శులు రజినీకాంత్, నీలిమ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలివ్వాలి

పాల్వంచరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు కాలనీలో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ రేవంత్ యువసేన నాయకుడు వానపాకుల రాంబాబు ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం తహసీల్దార్ రంగాప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ధరణి పోర్టల్‌లో సుమారు 150మందికి పైగా రెడ్డిగూడెం గ్రామ రైతుల భూముల వివరాలు నమోదు కాలేదని బాధితులు తహసీల్దార్‌ను విన్నవించుకున్నారు. కోడిపుంజుల వాగు గ్రామపంచాయతీలోని పూసలతండా గ్రామానికి చెందిన రైతులకు పోడుపట్టాలివ్వాలని సర్పంచ్ శంకర్‌సాధు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

విచారణ జరిపించండి

టేకులపల్లి: ప్రభుత్వం బీసీల్లోని నిరుపేదలకు అందజేస్తున్న రూ.లక్ష రుణం పక్కదారి పడుతోందని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అయిల నాగార్జునాచారి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మాట్లాడుతూ... కులవృత్తిదారులను కాకుండా అనర్హులను ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. కలెక్టర్ స్పందించి టేకులపల్లితో పాటు జిల్లాలో మంజూరైన బీసీ రుణ జాబితాను పరిశీలించి సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువజన కాంగ్రెస్ కమిటీల నియామకం



అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం, పాల్వంచ పట్టణ, లక్ష్మీదేవిపల్లి మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షుల కమిటీని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొందెం వీరయ్య ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్ నియమించారు. మంగళవారం నియమాక పత్రాలను అందజేశారు. కొత్తగూడెం పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహమ్మద్ ఉస్మాన్ అలీ, పాల్వంచ పట్టణ అధ్యక్షుడిగా హెచ్.మధు, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా బట్టు అరుణ్, పాల్వంచ మండలం అధ్యక్షుడిగా భూక్యా గిరిప్రసాద్‌లను నియమించారు.

పారిశుద్ధ్యం కలేనా..?

- దంతలబోరు గ్రామంలో ఏ వీధిలో చూసినా అపరిశుభ్రతే..
- డ్రెయినేజీలు లేక ప్రజల అవస్థలు
- దత్తత తీసుకుని వదిలేసిన మాజీ ఎమ్మెల్యే



దంతలబోరు(గోల్లగూడెం) ప్రధాన వీధిలో రహదారిపై నిలిచిన వాననీరు

పాల్వంచరూరల్: దంతలబోరు గ్రామ పంచాయతీలో పలు సమస్యలు ప్రజలను వేధిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. అసలే వర్షాకాలం దీనికితోడు పారిశుద్ధ్య లోపం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధులన్నీ బురదమయంగా మారి దోమలు, ఈగలు విజృంభిస్తుండడంతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్న పరిస్థితి. ఐదు సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పి ఇటువైపు కన్నెత్తి చూడలేదు. మండలంలోని శివారు గ్రామపంచాయతీ అయిన దంతలబోరు, గోల్లగూడెం గ్రామాల్లో 250 నివాసాలు, 1500 పైన మంది జనాభా ఉన్నారు. ప్రధాన రహదారి మినహా వీధుల్లో అన్నీ మట్టి రోడ్లే ఉన్నాయి. దీనికి తోడు డ్రెయినేజీ కాల్వలను నిర్మాణం చేయకపోవడంతో వర్షాకాలంలో చిన్న వర్షం కురిసినా రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. వర్షపు నీటికి తోడు నివాసాల్లోని మురుగు బయటకు వెళ్లే పరిస్థితి లేక వీధుల్లో నిల్వ ఉంటున్నాయి. గతంలో కచ్చా డ్రెయినేజీ తీయడం వలన వరద నీరు, నివాసాల్లోని మురుగు అందులోకి చేరి అపరిశుభ్రంగా తయారయింది.గ్రామంలో డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లు నిర్మాంచాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు మండలాధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు..

గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ ఇంటింటికి వేయలేదు. పాత పైపులైన్ ద్వారా నీళ్ల సరఫరా జరుగుతున్నా అవి సరిపోవడం లేదు. గ్రామంలో ఆరు బోర్లు ఉండగా నాలుగు పని చేయడం లేదు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న ఓవర్ ట్యాంక్ ద్వారా వచ్చే నీళ్లు సరిపోక బోర్ల నీటిని వినియోగించుకుంటున్న పరిస్థితి. వైఎస్సార్ విగ్రహం వద్ద ఉన్న బోరులోకి మురుగు నీరు కలుస్తోందని స్థానికులు వాపోతున్నారు.

గ్రామాన్ని దత్తత తీసుకున్నా బాగుపడలేదు..

2018లో అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకట్రావు గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మండలంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. అన్నిశాఖల అధికారులతో ప్రత్యేక



కుంగిన బోరు

కమిటీని ఏర్పాటు చేసి ఇంటింటికీ సర్వే చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రహదారితోపాటు పైపులైన్ నిర్మాణం చేసి ఆ తర్వాత పట్టించుకోలేదు. కనీసం ఒక్క డ్రెయినేజీ కూడా నిర్మాణం చేయకపోవడంతో మురుగు నీరు అంతా నివాసాల మధ్య నిల్వ ఉంటోంది. గతంలో విషజ్వరాల బారిన పడి పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

సైడుకాలువలు నిర్మించాలి



గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణం చేయకపోవడంతో వర్షం నీరు, ఇళ్లల్లోని మురుగు నివాసాల మధ్య నిల్వ ఉంటోంది. దీంతో అంటువ్యాధుల బారిన పడుతున్నాం. అంతర్గత రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో వీధులు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో డ్రెయినేజీలను నిర్మించాలి.
– అన్నపూర్ణ, గోల్లగూడెం

నిధుల సమస్య ఉంది..



గ్రామపంచాయతీలో సైడు కాల్వలు, అంతర్గత సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పలుమార్లు మండల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. నిధులు లేని కారణంగా ఈ సమస్యలను పరిష్కరించలేకపోయాను. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తాం.
– తెల్లం అలివేలు, సర్పంచ్, దంతలబోరు

ప్రతిపాదనలు పంపిస్తాం..



దంతలబోరు గ్రామంలో డ్రెయినేజీ కాల్వల నిర్మాణానికి సుమారు రూ.50 లక్షల నుంచి 60 లక్షల వ్యయం అవుతుంది. సీసీ రోడ్లకు అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటాం. మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగు చేయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.
– బి.అప్పారావు, ఎంపీడీఓ, పాల్వంచ

పారిశుద్ధ్య పనులకు సహకరించండి



ఎంపీడీఓ, కార్మిక సంఘాల నాయకులతో చర్చిస్తున్న ఎంపీపీ నాగరత్నమ్మ

ఇల్లెందురూరల్: ప్రజారోగ్య పరిరక్షణ కోసం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగించేందుకు సహకరించాలని ఎంపీపీ చీమల నాగరత్నమ్మ కార్మిక సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కార్మిక సంఘాల నాయకులు, ఎంపీడీఓ చిరంజీవితో సంయుక్త సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. 12రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె కొనసాగించడం వల్ల పల్లెల్లో పారిశుద్ధ్యం అధ్వాన స్థితికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లేందుకు గ్రామ పంచాయతీలకు వెసులుబాటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే పల్లెల్లో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. పల్లెల్లో పారిశుద్ధ్య పనులు ప్రారంభించాలని, ప్రతి గ్రామపంచాయతీలో పనులను మండల, పంచాయతీ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.

వామపక్ష పార్టీ నేతల ముందస్తు అరెస్టు

పాల్వంచ: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటి ముట్టడిలో భాగంగా ముందస్తుగా పోలీసులు.. వామపక్ష పార్టీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఎం పట్టణ కార్యదర్శి దొడ్డా రవికుమార్‌లను ఎస్ఐ నాగభిక్షం అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌లో ఉంచారు.
జూలూరుపాడు: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని జీపీ కార్మికులు ముట్టడి చేస్తారనే సమాచారంతో మంగళవారం సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ యాసా నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్‌లను ఎస్ఐ పోటు గణేష్ అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జీపీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా పోలీసుల చేత తమను అరెస్టు చేయించడం అన్యాయమని సీఐటీయూ మండల కన్వీనర్ యాసా నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్ అన్నారు.

‘బాయ్స్ ఫర్ చేంజ్’



మాట్లాడుతున్న రూపాదేవి

ఇల్లెందు: బొజ్జాయిగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ‘బాయ్స్ ఫర్ చేంజ్’కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఏటీడీఓ రూపాదేవి ముఖ్యఅతిథిగా హాజరై 7, 8, 9 తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించారు. నైతిక విలువలు, చదువులో నైపుణ్యం, విమర్శనాత్మకత, జీవనైపుణ్యాలను తదుపరి అంశాలతో ‘బాయ్స్ ఫర్ చేంజ్’కార్యక్రమం సభ్యులకు అవగాహన ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, బాయ్స్ ఫర్ చేంజ్ ఇన్‌చార్జ్ ప్రతీక్, రాకేష్, రమేష్, సాత్విక్, కౌన్సిలర్లు నేతాజీ, జయస్వామి, వినయ్, నివాస్, సాయి ప్రకాష్, వరుణ్, నితిన్, హరీష్, ఉమేష్, మెహర్ ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యాధులను దరి చేరనివ్వొద్దు

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చీమల నాగరత్నమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామపంచాయతీ, వైద్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బందితో సీజనల్ వ్యాధులను అరికట్టడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటం వల్ల పల్లెల్లో చెత్తకుప్పలు పేరుకపోయాయన్నారు. వాటిని తక్షణం తొలగించడంతోపాటు బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. వైద్యసిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామాలలో ఎవరు అస్వస్థతకు గురైనా వెంటనే స్థానిక ఆశ కార్యకర్త లేదా ఏఎన్ఎంలకు సమాచారం అందించాలన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై అంగన్‌వాడీ టీచర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత, ఎంపీడీఓ చిరంజీవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



జూలూరుపాడు: గురువాగుతండాలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజశ్విని

జూలూరుపాడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్విని అన్నారు. మంగళవారం గురువాగుతండాలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ తేజశ్విని మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి తొట్లు, టైర్లు, ఖాళీ పాత్రలు, కూలర్లు, కొబ్బరి బొండాలలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడా భోజ్యా నాయక్, సెక్రటరీ సరిత, హెచ్ఎస్ రత్నకుమార్, ఏఎన్ఎం అనూష పాల్గొన్నారు.

నివారణ చర్యలు తీసుకోండి

ఇల్లెందురూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు ప్రారంభించాలని కోరుతూ మండలంలోని కొమరారంలో పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహితకు అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర నాయకులు మోతీలాల్ మాట్లాడుతూ.. పల్లెల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసిందని, పరిస్థితి అదుపుతప్పక ముందే ప్రభుత్వం తక్షణం స్పందించి పంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కోరారు. కార్యక్రమంలో పోచారం, బోయితండా సర్పంచ్‌లు వాంకుడోత్ శ్రీను, బానోత్ సంతు, జోగ కృష్ణ, మూడు మాలు, తారాచంద్, రవి, నగేష్, సునీల్, రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మార్కెటింగ్ జీఎంకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి మార్కెంటింగ్ జనరల్ మేనేజర్‌గా ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న కె.సూర్యనారాయణను మంగళవారం పలువురు సన్మానించారు. జీఎం శాలేం రాజు మాట్లాడుతూ.. కంపెనీలో చిరుద్యోగిగా చేరి ఉన్నతస్థాయికి చేరిన సూర్యనారాయణ సేవలు మరువలేనివన్నారు. అధికారులు రఘురామిరెడ్డి, సామ్యూల్ సుధాకర్, జి.వీ.కోటిరెడ్డి, రామకృష్ణ, శ్రీరమేష్, బీ.వీ.ఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

ఇల్లెందు: మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను ప్రజలు స్వీకరించాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని 2, 4 వార్డులలో మొక్కలు పంపిణీ చేశారు. హరితహారంలో భాగంగా ఇంటింటికీ ఆరు పూల మొక్కలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. పట్టణ ప్రజల కృషి వల్లే మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీగా గుర్తింపు వచ్చిందన్నారు. హరితహారంలో అగ్రస్థానంలో ఇల్లెందు మున్సిపాలిటీ ఉండాలని ఆ దిశగా పట్టణ ప్రజలంతా ప్రయత్నం సాగాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కటకం పద్మావతి, సయ్యద్ ఆజం, ఏఈ శంకర్, బీఆర్ఎస్ నేత ఈశ్వర్ పాల్గొన్నారు.

29న సింగరేణి కార్యాలయం ఎదుట సభ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈనెల 29న సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు బి.మధు మంగళవారం తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల ఒప్పందం, చట్టాల అమలు, పెండింగ్ సమస్యల సాధన తదితర సమస్యలపై చర్చించడంతో పాటు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యాన అంత్యక్రియలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ 10వ వార్డు రామవరంలో మార్కెట్ వద్ద ఓ వ్యక్తి మృతి చెందాడు. రిక్షా కార్మికుడైన శంకర్.. భార్య మృతి చెందాక చూసే వారు లేక రామవరం మార్కెట్‌లో యాచనతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్ మునిగడప పద్మ తదితరులు మంగళవారం ఉదయం మున్సిపల్ సిబ్బందితో అంత్యక్రియలు చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది ప్రభుదాస్, తాళ్ల రాజేష్, నాయకులు వెంకటేశ్వర్లు, గౌస్, దమ్మేటి నాగేశ్వరరావు, మైనుద్దీన్, మజీద్, చందర్ పాల్గొన్నారు.

దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ..



రైతువేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: కేసీఆర్ కృషితో విద్యుత్ సరఫరా మూడు పంటలకు కావాలా..? కాంగ్రెస్ పార్టీ ఇచ్చే మూడు గంటల కరెంటు కావాలా..? అని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్ ఆదేశాల మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులోని రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రైతులు తేల్చుకోవాల్సి న తరుణమిదేనని, జై కిసాన్ నినాదాన్ని నిజం చేసిన నేల తెలంగాణ అని అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ దేశానికే అన్న పూర్ణగా మారిందన్నారు. కాంగ్రెస్ కరెంట్ కుట్రలను తిప్పి కొట్టేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నాడు అయినా.. నేడు అయినా.. ఏనాడైనా స్వతంత్ర భారతచరిత్రలో విద్యుత్ కష్టాలకు కాంగ్రెస్ పార్టీయే కారణమని, కాంగ్రెస్ను నమ్మితే కరెంట్ షాక్ కొనితెచ్చుకున్నట్టే నన్నారు. బీఆర్ఎస్ అంటే నిరంతర వెలుగులు.. కాంగ్రెస్ అంటే కటిక చీకట్లు అని విమర్శించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, బానోతు రామ, బానోతు కిషన్, చీమల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

26న ‘మహా పడావ్’ సన్నాహక సదస్సు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలకు నిరసనగా ఆగస్టు 8, 9 తేదీలలో జరగబోయే మహాపడావ్‌కు సన్నాహకంగా జూలై 26న జరగనున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని, జిల్లా కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు ఆ సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఒకపక్క కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా ఉంటూనే, మరోపక్క ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసే మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

తరతరాలుగా ఏజెన్సీలోనే జీవిస్తున్నాం..



మాట్లాడుతున్న లక్కినేని సురేందర్‌రావు

టేకులపల్లి: ఏజెన్సీ చట్టాలైన 1/70, పెసా, 2006 అటవీ హక్కు చట్టం తదితర చట్టాలకు, ఆదివాసీ, గిరిజనులకు తాము వ్యతిరేకం కాదని గిరిజనేతరుల సంఘం నాయకుడు, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కందస్వామి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన గిరిజనేతరుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచే ఏజెన్సీల్లో గిరిజనులతో కలిసి జీవిస్తున్నామన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు కూడా పొందలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, విద్యుత్ మీటర్, బోరు అనుమతి, పోడు భూమి పట్టాలు తదితరములకు అర్హతలున్నపటికీ గిరిజనేతరులు నోచుకోవడం లేదన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు నివసించే హక్కు కల్పించాలని కోరారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు లేకుండా, ఏ రాజకీయ పార్టీకి అనుబంధం లేకుండా, రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా గిరిజనేతరులంతా కలిసి హక్కుల కోసం పాటుపడుతున్నట్లు చెప్పారు. గిరిజనేతరుల న్యాయమైన పోరాటానికి ఆదివాసీ, గిరిజనులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈనెల 22న టేకులపల్లిలో జరగనున్న ర్యాలీ, సభను జయప్రదం చేసేందుకు ఎస్సీ, బీసీ, ఓసీ, ఓబీసీ, మైనారిటీలు రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. గుడిపూడి మోహన్‌రావు, ధర్మపురి వీరబ్రహ్మేంద్ర చారి, హనీఫ్, కళత్తూర్ కందస్వామి, నర్సింగ్ లక్ష్మయ్య, మౌలానా, గుడిపూడి సత్యనారాయణ, ఉల్లోజు ఉదయ్, కడుదుల రామారావు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయండి

సుజాతనగర్: సుజాతనగర్, సీతంపేట గ్రామాల మధ్య ఎదుళ్లవాగుపై రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టిన వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ శ్రేణులతో కలిసి వంతెన నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. మాట్లాడుతూ.. గతంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి కుప్పకూలిపోయిందని, 2021లో నూతనంగా మరో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నిధులు కేటాయించి సంబంధిత అధికారులు చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

‘సంకల్ప’ బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

పాల్వంచ: సీపీఎస్‌ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి హెడ్డాఫీస్ నుంచి పాల్వంచ బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించే పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర (బైక్ ర్యాలీ)ని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో.. గత 16వ తేదీన గద్వాలలో చేపట్టిన రథయాత్ర ఈనెల 31న యాదాద్రిలో ముగుస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

జీఎంను కలిసిన దివ్యాంగులు

ఇల్లెందు: సింగరేణి ఏరియా జీఎం జాన్‌ఆనంద్‌కు మంగళవారం పట్టణ దివ్యాంగుల సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. సింగరేణిలో ఓ ఖాళీ క్వార్టర్‌ను దివ్యాంగుల కార్యాలయానికి కేటాయించాలని విన్నవించారు. అంతకు ముందు నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువతో సత్కరించారు. ఈశ్వర్, రాజేందర్, రజాలీ పాషా, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమ్మె విరమింపజేయాలి

సింగరేణి(కొత్తగూడెం): 13 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. మాట్లాడుతూ.. సీఎం హామీ మేరకు పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఆలయంలో పారాయణం



పారాయణం చేస్తున్న భక్తులు

పాల్వంచ: అధిక శ్రావణ మాసం పురస్కరించుకుని శ్రీ ఆంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని శాస్త్రీరోడ్డులో భజన మందిర రామాలయంలో నెల రోజులు నిర్వహించనున్న కోటి విష్ణు సహస్ర నామ పారాయణం మంగళవారం ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు పారాయణం ఉంటుందని ఆలయ ఈఓ రజనీ కుమారి తెలిపారు.

కక్ష సాధింపు సరికాదు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ నేతలు కలిసి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు తాండ్ర నాగబాబు ఆరోపించారు. మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో నిరసన తెలిపి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. మాట్లాడుతూ.. 2014లో నిర్మించిన ఫంక్షన్ హాల్‌లో ఎన్నెస్పీ భూమి కలిసిందని ఇప్పుడు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఇటీవల పార్టీ మారాననే కక్షతోనే శ్రీనివాసరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..

ప్రధాన రహదారి పక్కన ప్రమాదం పొంచి ఉంది. యానంబైల్ హరిజనవాడకు సమీపంలో ఉల్వనూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎటువంటి రక్షణ లేదు. పశువులు, మనుషులు నిత్యం ఈ మార్గంలో రేయింబవళ్లు రాకపోకలు కొనసాగుతుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రవీందర్,
విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ
సెల్ నెంబర్ 9440811564